వరద కష్టాలు తీరేదెన్నడో..

- కాజ్‌వేలపై నుంచి ప్రవహిస్తున్న వరద
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- కల్వర్టులుగా మార్చాలని కోరుతున్న ప్రజలు

గుర్రంపోడు : మండలంలో పలు గ్రామాల మధ్య కాజ్‌వేలు జీవనదుల్లా ప్రవహిస్తూ ప్రజలు కాజ్‌వేలు దాటడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు మాత్రమే వరద నీరు ప్రవహించి ఆ తర్వాత మామూలుగా ఉండే కాజ్‌వేలు ఏఎమ్మార్పీ కాల్వల నీటికి వర్షపు నీరు తోడు కావడంతోపాటు వరి పొలాలు నీరు ప్రవహిస్తుంది. కాజ్‌వేలు నాచుపట్టి వాహనాల టైర్లు జారి ప్రమాదాలు జరగటం, నడిచివెళ్లే వారు జారడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

లో లెవల్ కాజ్‌వేలు ఇవి..

మండలంలో బోడపాడు–బొల్లారం గ్రామాల మధ్య, నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారి నుంచి లక్ష్మీదేవిగూడెం రోడ్డులో, వెంకటాపురం(ఎస్) గ్రామానికి వెళ్లే రోడ్డులో, చేపూరు – తెరాటిగూడెం గ్రామాల దారిలో పిట్టలగూడెం–వట్టికోడు గ్రామాల రోడ్డులో, తెరాటిగూడెం– బంటుగూడెం దారిలో కాజ్‌వేలు ఉన్నాయి. మొసంగి– కొత్తలాపురం మధ్య గూనలు వేసి మట్టిపోసినా సరైన ఎత్తులో లేక శశిలేటి వాగు ఉధృతంగా వస్తే రాకపోకలు నిలిచిపోవల్సిందే. మొసంగి – తమ్మడపల్లి



కోనాయిగూడెం దారిలో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదను దాటుతున్న గ్రామస్తులు

దారిలోనూ కాజ్‌వే వల్ల ప్రయాణం కష్టంగా మారుతుంది. తెరాటిగూడెం– మొసంగిల మధ్య కాజ్‌వే పైన గూనలు వేసి బ్రిడ్జి నిర్మించే పనులకు నిధులు సరిపోవని తెచ్చిన గూనలు కూడ కంట్రాక్టరు తీసుకుని వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేలు నాచుపట్టి జారుతూ ద్విచక్ర వాహనదారులకు,బాటసారులకు ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. కాజ్‌వేల్లో వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మహిళలు కాజ్‌వేల నీటిలో రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేలను బ్రిడ్జిలు మార్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావును ప్రశ్నించగా కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరుకావల్సి ఉందని తెలిపారు.



నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి నుంచి లక్ష్మీదేవిగూడెం రోడ్డులో..

కల్వర్టులుగా మార్చాలి



మొసంగి, తెరాటిగూడెం, కొత్తలాపురం, జిన్నాయిచింత, పల్లిపాడు, సుల్తాన్‌పురం గ్రామాల దారుల్లో కాజ్‌వేలను కల్వర్టులుగా మార్చాలి. తెరాటిగూడెం– మొసంగిల మధ్య కల్వర్టు నిర్మాణానికి కోటి రూపాయలతో నిధులు రెండేళ్ల క్రితమే బ్రిడ్జి మంజూరైనా కంట్రాక్టరు పని ప్రారంభించలేదు. కాజ్‌వేలను కల్వర్టులుగా మార్చకపోవడంతో రైతులు సరకు రవాణాలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– జక్కల నర్సింహ్మా, రైతు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : పట్టణంలోని 132/33కేవీ హాలియా సబ్ స్టేషన్‌లో బస్ మెంటనెన్స్ నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ధన్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11కేవీ హాలియా, యాచారం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గృహ, వాణిజ్య, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్)లో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): హాలియా 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నెల్లికల్లు, అల్వాల, తిరుమలగిరి, రాజవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చిత్ర వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పీఆర్‌టీయూ టీఎస్ సంఘాన్ని ఎదుర్కొనలేకనే యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మొక్క పరశురాం, కూస్‌రెడ్డి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌టీయూ సంఘం, నాయకులపై అసత్య ఆరోపణ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జార్జి, లక్ష్మీరాము, అమృతయ్య, భాను నాయక్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జబ్బార్ గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఏ విధంగా చేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేయడంపై ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.కె.నాగేశ్వర్ రావునాయక్, ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది రాణి, రవి, సువర్ణ, శిరీష, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న పశువైద్యులు

మాడుగులపల్లి : పాడి రైతులు పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్య శాలలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పశువైద్య శిబిరంలో 70 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించగా పలు పశువులకు గాలికుంటు నివారణటీకాలు, నట్టల నివారణ మందులు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు విక్రమ్, సాయిరాం, సిబ్బంది శ్రీలత, జయమ్మ, శోభన్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, రాకేష్, వినోద్, నవీన్, అలెంబిక్ క్రాంతి, రైతులు ఐచ్చిరెడ్డి, ముక్తారెడ్డి, వెంకన్న, శంకరయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ డివిజన్ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : బీసీ జేఏసీ మిర్యాలగూడ డివిజన్ కమిటీని మంగళవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా జి. నాగేశ్వర్‌రావు, యువజన, విద్యార్థి సంఘం చైర్మన్‌గా గాదగోని మహేష్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఈ నెల 18న నిర్వహించే తెలంగాణ బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దాసరాజు జయరాజు, శిరసనగండ్ల ఈశ్వరాచారి, బంటు వెంకటేశ్వర్లు, మురళియాదవ్, దుర్గయ్య, నాగేందర్, రామకృష్ణ,శేఖర్, బంటు సైదులు, సావిత్రి, జయమ్మ, సురేష్, అశోక్‌చారి, కృష్ణ, రాజు, మణి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సురక్ష బీమా యోజనపై అవగాహన

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రధాన మంత్రి వచ్చిన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణ స్థాయి జన సురక్ష కార్యక్రమం అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనపై పట్టణంలోని మెప్మా రిసోర్స్ నమోదు చేయించాలన్నారు. దీనికి 18ఏళ్ల నుంచి 70ఏళ్ల వయస్సు వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం కింద అమోజాన్, మీ షో, మీ జోమోటో, ఫ్లిఫ్కార్ట్ తదితర షాపింగ్ మాల్ పని చేస్తున్నటువంటి సేల్స్‌మన్‌లు కూడా అర్హులని అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంలో సభ్యులను చేర్పించేందుకు మున్సిపల్



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంచార్జీ మేనేజర్ జ్ఞానేశ్వరీ, యూనియన్ బ్యాంకు అధికారి నవీన్, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ పాతేపాక బక్కయ్య, మెప్మా సీవోలు మామిడాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలోనూ బాలాజీనాయక్ బాధితులు

మిర్యాలగూడ : అధిక వడ్డీలు ఇస్తానని ఆశ చూపి అమాయక ప్రజల నుంచి కోట్ల రూపాయలను తీసుకొని బాలాజీనాయక్ నిండా ముంచాడని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దామరచర్ల మండలంలోని బాలాజీ నాయక్ బాధితులు పలువురు రూ.10కోట్లకు పైగా మోసపోయి నట్లు పేర్కొన్నారు. మండలంలోని వాచ్యాతండా, బొట్టితండా, గాంగ్యాతండా, నర్సాపురం తదితర గ్రామస్తులకు పీఏపల్లి మండలం వద్దిపట్ల, పలుగు తండాల్లో బంధుత్వాలు ఉన్నాయని, వందకు రూ.10 వడ్డీ ఇస్తుండడంతో మండల ప్రజలు కొందరు లక్షల్లో, కొందరు కోట్లలో డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. ఏడాది పాటు బాలాజీ నాయక్ ప్రజలకు నెలవారి చెల్లింపులు సక్రమంగా చేసి నమ్మకం కలిగించడంతో ప్రజలు ఇంకా అధికంగా డబ్బులను బాలాజీనాయక్‌కు ముట్టజెప్పాడని తెలిపారు. బాలాజీనాయక్ బాధితుల్లో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. గ్యాతండాలో కొందరు తమ ఇళ్లనరు తాకట్టు పెట్టి మరీ రూ.3కోట్ల వరకు అందించగా మరికొందరు బంగారం తాకట్టు పెట్టి లక్షల్లో సమర్పించామని తెలిపారు. వైటీపీఎస్ నిర్వాసితులకు పరిహారం రాగా ఒకరు రూ.1కోటికి పైగా ఇచ్చినట్లు సమాచారం. అతడికి కొన్ని నెలల పాటు వడ్డీ సక్రమంగా అతడి ఖాతాలో జమా చేస్తుండడంతో మరికొంతమంది నిర్వాసితులు ఆశపడి భారీ మొత్తంలో బాలాజీనాయక్‌కు అప్పుగా ఇచ్చినట్లు సమాచారం. ఉద్యోగులు మోసపోయామని మిన్నకుండగా, కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయించారు. బాలాజీనాయక్ బాధితులు దేవరకొండ డివిజన్ పరిధిలోని గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలని ఎస్పీ సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ : హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని దేవరకొండ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కె. అనిత అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేష్, సెక్రటరీ కర్నాటి సురేష్, న్యాయవాదులు షౌకత్‌అలీ, అశోక్, రాములు, శ్రీకాంత్, కృష్ణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జడ్జి కె.అనిత

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



త్రిపురారం : విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంజయ్

వేములపల్లి : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, సీహెచ్‌ఓ ప్రవీణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ రజిని, నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఏఎన్‌ఎం శైలజ, అంగన్‌వాడి టీచర్లు, జయమ్మ, ఆశా వర్కర్లు, బాలికలు స్వరూప, రమాదేవి, సునిత, నాగమ్మ, ఆశా వర్కర్లు కె. రాణి, ఎ. మల్లీశ్వరీలతో పాటు కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసుకోవడంతో ఆర్గానిక్ పంటల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం–1,2,3,4లలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పల్లె పద్మ, టి. శ్రీదేవి, టి సరిత, ఆకారపు ఝాన్సీ, హెల్పర్లు

పౌష్టికాహారంపై వ్యాసరచన పోటీలు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పౌష్టికాహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.మంజుల విద్యార్థులకు పౌష్టికాహార ప్రాధాన్యత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, దామోదర్‌రెడ్డి, లింగయ్య, వెంకటాచారి, గోపికృష్ణ, గీత, రవి, అంజిరెడ్డి, హేమలత, నవనీత, జానకమ్మ, అంగన్‌వాడీ టీచర్లు మణెమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

త్రిపురారం : ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ మాలోతు సంజయ్ సూచించారు. ఐసీడీఎస్ దామరచర్ల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ మాసం కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలోతు సంజయ్ విద్యార్థులు,చిన్నారులు బరువు తగ్గడం, రక్త హీనత, పౌష్టికాహారం లోపం వల్ల కలిగే ఇబ్బందులు, మలబద్ధకం, కడుపులో నులిపురుగులు తదితర వాటికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మల్లీశ్వరి, ప్రదానోపాధ్యాయులు నూనె సత్యనారాయణ, అంగన్ వాడీ టీచర్లు శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌డ్యాంను సందర్శించిన విశ్వరాజన్ మహంతి



హైమాస్ట్ గేట్లపై నుంచి డ్యాంను వీక్షిస్తున్న విశ్వరాజన్ మహంతి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : డీసీసీ ఎన్నికపై జిల్లా, మండల స్థాయి నాయకులనుంచి సమాచారం సేకరించేందుకు నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి విస్వరాజన్ మహంతి స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డితో కలిసి నాగార్జునసాగర్ డ్యాం ను సందర్శించారు. సాగర్ డ్యాం హైమాస్ట్ పై నుంచి దిగువకు పరుగులీడుతున్న కృష్ణమ్మ సోయగాలను సందర్శించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

విద్యార్థులకు రైతుల అనుభవాలు ముఖ్యం

త్రిపురారం : వ్యవసాయ విద్యలో క్షేత్రస్థాయిలో పంటలసాగులో రైతుల అనుభవాలకు విద్యార్థులు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నూతన పద్ధతులపై పరిశోధనలు సాగించాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్ర శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని దుగ్గెపల్లి వ్యవసాయ క్లస్టర్‌లోని రైతు వేదికలో కేవీకే కంపాసాగర్ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల, పాలెం, విద్యార్థులు రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్(ఆర్‌ఏడబ్ల్యూఈపీ) కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానంపై వ్యవసాయ విద్యార్థులు ఏర్పాటు చేసిన డెమోలను ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సలుభంగా పంటలు సాగు చేసే విధంగా ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్ర శేఖర్

పలువురు రైతులు తమ స్వీయ అనుభవాలను విద్యార్థులు, శాస్త్రవేత్తలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వరి పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, హాలియా ఏడీఏ సరిత, సీనియర్ శాస్త్రవేత్త శ్రీధర్, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములయ్య, ఉద్యాన వన శాస్త్రవేత్త హిమబిందు, త్రిపురారం వ్యవసాయాదికారి పార్వతి చౌహాన్, ఏఈఓ సమీర్, పంచాయతీ కార్యదర్శి రాధిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

పెద్దవూర : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గావాయిపై దాడి అమానుషమని దళిత సంఘాల నాయకులు ముదిగొండ వెంకటేశ్వర్లు, దొంతాల నాగార్జున అన్నారు. మంగళవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్, పూలే, జగ్జీవన్ రావు విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు ముదిగొండ వెంకటేశ్వర్లు, దొంతాల నాగార్జున మాట్లాడారు. సీజే బీఆర్ గవాయి వాదనలు వింటున్న సమయంలో రాకేష్ అనే న్యాయవాది బూటు విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ దాడి భారతి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపైనే దాడిగా ఉందని తక్షణమే అతనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాకేష్‌ను న్యాయవాద వృత్తి నుంచి శాశ్వతంగా తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు మల్లయ్య, కరుణాకర్, రవికుమార్, శంకర్, ప్రభాస్ ఉన్నారు.

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ మంగళవారం బీసీ యువజన సంఘాల ఆధ్వర్యంలో జడ్చర్ల–కోదాడ జాతీయ ప్రధాన రహదారి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, అగ్రకులాల వారు కపట ప్రేమతో బీసీల ఓట్లను దండుకుంటున్నారన్నారు. బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సి రిజర్వేషన్లు రానివ్వకుండా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. బీసీల ఉద్యమానికి అన్నీ రాజకీయ పార్టీలు మద్దుగా రావాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలో ఉన్న బీసీలందరూ పార్టీలకు అతీతంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. బీసీలను విస్మరిస్తే పుట్టగతులు కూడా ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నాగేశ్వర్‌రావు, గంగాధర్, రమేష్, వీరస్వామి, శంకర్, శ్యాం, సురేష్, ఉపేందర్, నవీన్, సిద్దం రాజు పాల్గొన్నారు.



ఖమ్మం రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని వినతి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని కోరుతూ బీజేపీ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వన్ టౌన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బంటు గిరి, కొంకరి వెంకటరమణ మాట్లాడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పెద్ద పెద్ద గుంతలు పడటంతో పాటు రాళ్లు తెలి ప్రజలకు ఇబ్బందిగా మారిందని, దీంతో వాహనదారులు, పాదాచారులు నరకం అనుభవిస్తున్నారన్నారు. అదే విధంగా ఇటీవల కాలంలో ఈ గుంతలు సరిగా కనబడకపోవడంతో ద్విచక్రవాహనం దారులు కిందపడిపోతున్నారన్నారు. వర్షాల సమయంలో ఆ గుంతల్లో నీరు నిల్వ ఉండి కనపించని పరిస్థితి ఉందని వెంటనే ఈ ప్లై ఓవర్ వద్ద గుంతలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో మూల రాజీరెడ్డి, పక్క రవిబాబు, మేడి నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : జనవరి 25 నుంచి 28వరకు హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో మహాసభల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళపై చిన్నచూపు ఉందని మహిళల భద్రతకు మరిన్ని చట్టాలు తీసుకురావాలని కోరారు. చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. దేశ వ్యాపస్తంగా మహిళలపై జరుగుతున్న సంఘటనలపై మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరుణ, కౌసల్య, మణెమ్మ, లలిత, నిర్మల పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లో నీరు.. నిలిచిన ట్రాక్టర్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని చిల్లాపురం రోడ్డులో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు అండర్‌పాస్‌లో నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మరో చిన్న అండర్‌పాస్ ఉన్నా..భారీ వహనాలు వెళ్లేందుకు వీలుగా నిర్మించిన మరో పెద్ద అండర్‌పాస్‌లో నాలుగు ఫీట్ల వరకు నీరు నిల్వ ఉంటుంది. వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తరలించేందుకు ఏర్పాటు చేసిన సమాంతరంగా ఉన్న బావికూడా నిండిపోవడంతో వర్షపు నీరు అండర్‌పాస్‌లోకి వచ్చి నిల్వ ఉంటుందని స్థానికులు వాపోయారు. మంగళవారం ఓ రైతు తన ట్రాక్టర్‌ను అండర్‌పాస్ గుండా తీసుకురాగా నీటి మధ్యలో ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరో ట్రాక్టర్ సాయంతో నీటిలో ఆగిపోయిన ట్రాక్టర్‌ను బయటికి తీయవలసి వచ్చింది. రైల్వే అధికారులు స్పందించి అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆ రోడ్డుగుండా రాకపోకలు సాగించే ప్రజలు కోరుతున్నారు.



రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన ట్రాక్టర్

డీసీసీ అధ్యక్ష పదవి ఎస్సీలకే ఇవ్వాలి

హాలియా : డీసీసీ అధ్యక్ష పదవి టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్యకే ఇవ్వాలని సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కోరారు. డీసీసీ అధ్యక్ష పదవి అభిప్రాయ సేకరణ సమావేశం మంగళవారం సాగర్‌లోని విజయ విహార్‌లో నిర్వహించారు. విజయ విహార్‌లో ఏఐసీసీ అబ్జర్వర్ విశ్వరాజన్ మహంతిని కలిసిన ఎస్సీ సెల్ నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు అల్లంపల్లి జానయ్య, నకిరేకంటి సైదులు, బూడిద విజయ్, తక్కెలపల్లి సైదులు, కొండ బాస్కర్, వీరయ్య, వెంకన్న, ఎడవెల్లి రంజిత్, గార్లపాటి గోవర్ధన్, శేఖర్, అనుముల అంజి, నరేందర్, సింగారపు నగేష్, పోలే మధు, కొండల్, రమేష్, శ్రీరాములు, రామాం. అనిల్, విజయ్ తదితరులు ఉన్నారు.



మహంతికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు

వర్షాలకు కూలిన విద్యుత్ స్తంభాలు



వర్కాలలో కూలిన విద్యుత్ స్తంభం

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- చీకట్లోనే వర్కాల ప్రజలు


కొండమల్లేపల్లి(చింతపల్లి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సంఘటన చింతపల్లి మండల పరిధిలోని వర్కాల గ్రామంలోని 7వ, 8వ వార్డులో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిల్చి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు ఇండ్ల సమీపంలో వైర్లు, స్తంభాలు పడిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. కాని విద్యుత్ అధికారులు మాత్రం ఫిర్యాదు చేసిన రెండురోజులకు మంగళవారం సాయంత్రం మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల నుంచి ప్రజలు చీకట్లోనే బిక్కు, బిక్కు మంటు భయబ్రాంతులతో గడిపారు. చీకట్లో విషపురుగులతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందారు. ప్రస్తుతం చేసే మరమ్మతులతోనైనా ఈ రోజు విద్యుత్ వెలుగులు వస్తాయా లేదా అని వార్డు ప్రజలు అంటున్నారు.



నెలకొరిగిన విద్యుత్ స్తంభం

క్రీడలతో మానసిక ప్రశాంతత

నల్లగొండ టూటౌన్: క్రీడలతో విద్యార్థులకు మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం కలుగుతుందని నీలగిరి మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో మంగళవారం బాలికల ఖోఖో, అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.విమల, నియోజకవర్గ కన్వీనర్లు శోభారాణి, జయరాజు, రాజశేఖర్‌రెడ్డి, జంగయ్య, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీదేవి, యుగంధర్‌రెడ్డి, కవిత, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్